క్లుప్తంగా

అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవాన్ని దహనం చేసేందుకు తీసుకువెళ్తున్న దృశ్యం

మల్కాపురం: వయసు మళ్లిన ఓ అనాథ 60వ వార్డు పరిధి ఎంఐజీకాలనీ సర్వీసు రోడ్డుపై మృతి చెందాడు. ఆ మార్గంలో వెళ్లే వారు జాలి పడుతున్నారే తప్పా కనీసం పోలీసులకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వలేదు. అదే సమయంలో ఆ మార్గంలో వచ్చిన కార్పొరేటర్ పీవీ సురేష్ మృతుడి గురించి తెలుకుని పోలీసులకు సమాచారం అందించారు. అనాథ కావడంతో తన సొంత ఖర్చులతో దహన సంస్కారాలు దగ్గరుండి చేయించారు. కోరమాండల్ శ్మశానవాటికకు తీసుకువెళ్లి అంతిమ క్రియలు జరిపించి మానవత్వాన్ని చాటుకున్నారు.

పత్రాలు సరిగ్గా లేని వాహనాల సీజ్

మల్కాపురం: నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సీఐ జి.డి.బాబు సిబ్బందితో కలిసి మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. దీనిలో భాగంగా ఆయా వాహనాల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. రికార్డులు సరిగ్గా లేకున్నా, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన వారి వాహనాలతో పాటు అతి వేగం,త్రిబుల్ డ్రైవింగ్ చేసిన వాహనదారులను నిలిపి వారికి తొలుత కౌన్సెలింగ్ ఇచ్చారు.అనంతరం వారి వాహనాలను స్టేషన్‌కు తరలించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గుల్లలపాలెం, శ్రీహరిపురం ప్రాంతాల్లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య మంగళవారం పరిశీలించారు. తొలుత గుల్లలపాలెం వెళ్లి అక్కడ నిర్మాణ పనులు పరిశీలించారు. నాణ్యత లోపిస్తే క్షమించేది లేదన్నారు.పనులు వేగవంతం చేయాలని సూచించారు.అనంతరం శ్రీహరిపురం వద్ద జరుగుతున్న పనులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు గులిగిందల కృష్ణ,కన్నబాబు,కోటా కృష్ణ,రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆయన నేత్రాలు సజీవం



కుటుంబ సభ్యులకు పత్రాలు అందిస్తున్న ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి సిబ్బంది

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు బుచ్చిరాజుపాలెం గవర వీధికి చెందిన దొడ్డి శ్రీను కుటుంబ సభ్యులు ఆయన నేత్ర దానానికి ముందుకు వచ్చారు. సోమవారం శ్రీను మనస్తాపంతో ఉరి వేసుకుని మృతి చెందిన విషయం విధితమే. ఈ మేరకు మృతుడి కుటుంబ సభ్యులు కేజీహెచ్‌లో మంగళవారం డాక్టర్ ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రికి శ్రీను కళ్లను దానం చేశారు.

అధ్యాపకులతోనే సామాజిక మార్పు

ఏయూ క్యాంపస్: సమాజంలో మంచి మార్పులు తీసుకువచ్చే శక్తి అధ్యాపకులకు ఉందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఏయూ హెచ్‌ఆర్‌డీసీ కేంద్రంలో నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. అధ్యాపకులు వైవిధ్యమైన జ్ఞానాన్ని విద్యార్థులకు అందించే ప్రయత్నం చేయాలన్నారు. భారత్ విశ్వగురువుగా ఆవిర్భవించాలని ప్రధాని మోదీ ఆశిస్తున్నారని, ఈ దిశగా యువతను తీర్చిదిద్దే బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్‌లో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ సమాజంతో అనుసంధానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్‌డీసీ కేంద్రం సంచాలకుడు ఆచార్య టి.వి.కృష్ణ, ఎన్.ఎ.డి.పాల్ పాల్గొన్నారు.

మహిళా పక్షపాతినే మళ్లీ ముఖ్యమంత్రి చేద్దాం

- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కృపా జ్యోతి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కృపాజ్యోతి

గోపాలపట్నం: మహిళా పక్షపాతి అయిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుందామని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కృపా జ్యోతి పిలుపునిచ్చారు. జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడాలేఅవుట్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం నియోజక వర్గ మహిళా నాయకులు, మహిళా కన్వీనర్లు, అనుబంధ సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ పని తీరు చాలా బాగుందన్నారు. తన సొంత నిధులతో ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. విశాఖలో ఉన్న నియోజకవర్గాలన్నీ వైఎస్సార్ సీపీ కైవసం చేసుకునే విధంగా అంతా పని చేయాలని పిలుపునిచ్చారు. ఇది ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు. ఇందుకు ప్రతీ మహిళా శక్తి వంచన లేకుండా పని చేయాలని కోరారు. మహిళలు తలచుకుంటే అసాధ్యమన్నది లేదన్నారు. మన ప్రభుత్వంలో చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ఆయా వీధుల్లో మహిళలకు వివరించాలని తెలిపారు. ఈ సందర్భంగా స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యురాలు శ్రీదేవి వర్మ, నాయకులు మళ్ల ధనలత, వార్డు మహిళాధ్యక్షులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

రూ.1.05 కోట్లతో రాయిచెరువు అభివృద్ధి

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- కోటనవరలో విస్తృత పర్యటన



కోటనరవలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, అధికారులు, నాయకులు

గోపాలపట్నం: జీవీఎంసీ 88వ వార్డు కోట నరవ లోని రాయి చెరువును రూ.1.05 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చెప్పారు. కోటనరవ కాలనీలో మంగళవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. రహదారులు, మురుగు కాల్వల సమస్యలను ఆయన పరిశీలించారు. ఇక్కడి ప్రధాన మురుగు కాల్వలో మురుగు వెళ్లేందుకు అవకాశం కల్పించాలని స్థానికులు కోరారు. దీనిపై కాల్వ నిర్మాణానికి గల అవకాశాల ను స్వయంగా పరిశీలించారు. విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు కావాలని కోరారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ కాలనీలో రోడ్ల అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేశామని తెలిపారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే రాయి చెరువును అభివృద్ధి చేయడంతో పాటు వాకింగ్ ట్రాక్, సుందరీకరణ పనులు చేపడుతున్నామని తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్ పనులు పూర్తి చేసి వద్దకు వెళ్తామని తెలిపారు. ఆయనతో పాటు జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం, వార్డు ఇన్‌చార్జ్ జి. మహలక్ష్మి నాయుడు, వార్డు అధ్యక్షుడు దాడి నూకరాజు, మళ్ల నూకప్పారావు, ఆళ్ల పైడిరాజు, మళ్ల రమణ, సచివాలయ కార్యదర్శులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సర్వీసు పునరుద్ధరణపై హర్షం

సింధియా: సీపీఎం మల్కాపురం జోన్ కమిటీ, గ్రామ సంఘాలు, మహిళా సంఘాలు వినతి మేరకు ఆర్టీసీ 38జే బస్సును పునరుద్ధరించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కోరమాండల్ గేటు, జవహర్ నగర్, జనతాకాలనీ మీదుగా త్రినాథపురం కాకరలోవ వరకు నడపనున్నారు. నెల రోజుల కిందట ఈ రూట్‌లో బస్సుకు ట్రాఫిక్ అంతరాయం కలగడంతో 38జె ఆర్టీసీ బస్సును నిలిపివేశారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో వెంటనే బస్సును తిరిగి పునరుద్ధరించాలని సీపీఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో గాజువాక డిపో మేనేజర్‌కు వినతి పత్రం సమర్పించడంతో పాటు డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. దీంతో మంగళవారం నుంచి ఈ బస్సును పునరుద్ధరించడంతో ఆర్టీసీ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు.

వెంగళరావుకు జియ్యాని నివాళి



వెంగళరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: మాజీ కార్పొరేటర్, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి కొల్లాబత్తుల వెంగళరావు మంగళవారం మరణించారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆయన నివాసానికి వెళ్లి భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వెంగళరావుతో పాటు కార్పొరేటర్‌గా పని చేశానని మంచి వ్యక్తి అని గుర్తు చేసుకున్నారు. ఆరోగ్యంగా ఉండే వ్యక్తి ఇలా మృతి చెందడం బాధాకరమని అన్నారు. మంచి మిత్రుడిని కోల్పోయానని వాపోయారు. అంతిమ యాత్రలో జియ్యాని పాల్గొన్నారు.

అధికారులు మొండి వైఖరి విడనాడాలి



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

మల్కాపురం: కూర్మన్నపాలెం ఆర్టీసీ డిపో అధికారులు కార్మికుల పట్ల మొండి వైఖరి విడనాడాలని ఎన్ఎంయూ జోనల్ వైస్ ప్రెసిడెంట్ బి.ఎం.రావు ఆరోపించారు. కూర్మన్నపాలెం డిపో యాజమాన్యం తీరును నిరసిస్తూ గాజువాక డిపో ఎన్ఎంయూ నాయకులు డిపో ఎదుట మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పి.ఆర్.సి ఎరియర్స్ వెంటనే చెల్లించాలని,ఓటీ షెడ్యూల్ తగ్గించాలని,బలవతంగా కార్మికులచే అదనపు సర్వీస్ కూర్మన్నపాలెం డిపో యాజమాన్యం చేయిస్తుందన్నారు. స్టాఫ్ రూమ్‌లో కనీస సదుపాయాలు కల్పించడం లేదని పేర్కొన్నారు. బస్సుల కండిషన్ మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రీజనల్ వైస్ ప్రెసిడెంట్ ఎం.ఆర్.రాజు, జోనల్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ సీపీకుమార్,యు.వి.ఎల్.ఎన్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీకి వ్యతిరేకంగా దీక్ష



దీక్షలో పాల్గొన్న అఖిలపక్ష యూనియన్ల నాయకులు

మల్కాపురం : ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా వ్యతిరేక విధానాల వలన సామాజ్యులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అఖిలపక్ష యూనియన్ల నాయకులు నక్క లక్ష్మణరావు యాదవ్, భోగవల్లి నాగభూషణం, కె.పెంటారావు, కె.సత్యనారాయణ ఆరోపించారు. అఖిలపక్ష కార్మిక సంఘాల పిలుపు మేరకు మల్కాపురం, హెచ్‌పీసీఎల్, కల్యాణి గేటు వద్ద మంగళవారం ఉదయం క్విట్ మోదీ.. సేవ్ ఇండియా దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యూనియన్ల ప్రతినిధులు మాట్లాడుతూ 9 ఏళ్ల మోదీ పాలనలో దేశానికి జరిగిన లాభం కంటే నష్టమే ఎక్కువన్నారు. ఆయన పాలనలో కార్మికుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉన్నాయన్నారు. కార్మికులకు కనీస వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, కనీస వేతనం రూ. 26 వేలు చేయాలని, కొత్త పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదానీ, అంబానీలకు సేవ చేయటం మానేసి దేశ ప్రజల సంక్షేమానికి మోదీ కృషి చేయాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష యూనియన్ల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడికి ఘన స్వాగతం



విమానాశ్రయంలో పీసీసీ అధ్యక్షుడు రుద్రరాజుకు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

గోపాలపట్నం: పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుకు విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు గొంప గోవిందరాజు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కె. లక్ష్మి, వేగి వెంకటేష్ తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖిల భారత కాంగ్రెస్ పిలుపు మేరకు ఆదివాసీ దినోత్సవాలు నిర్వహించనున్నామని తెలిపారు. అరకులో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఆయనతో పాటు ఉత్తరాంధ్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి వచ్చారు. విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గాన అరకు బయలుదేరి వెళ్లారు.

ఏయూ సమాచారం

కాలానుగుణంగా నైపుణ్యాల పెంపు అవసరం



రిసోర్స్ పర్సన్స్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఏయూ డీసీఎంఎస్ విభాగంలో మేక్ యువర్ సెల్ఫ్ కార్పొరేట్ రెడీ అంశంపై నిర్వహించిన ప్రత్యేక శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పుస్తక జ్ఞానంతో పాటు, సాఫ్ట్‌స్కిల్స్, వ్యక్తిత్వం, వ్యవహార శైలి వంటివి ఉద్యోగ సాధనలో ఎంతో కీలకమన్నారు. ఉద్యోగం నిమిత్తం ఇంటర్వ్యూకు వెళ్లే సమయంలో ఆ సంస్థకు సంబంధించిన వివరాలపై అవగాహన ఉండాలని సూచించారు. రూబికన్ సంస్థ ప్రతినిధులు అమర్ నాగేంద్ర, పల్లవి, కోమలి మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం అతిథులను విభాగం తరపున సత్కరించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, ప్లేస్‌మెంట్ అధికారి వి.ఆర్.రెడ్డి, మోహన్‌గణేష్, విభాగ ఆచార్యులు ఎస్.సాంబశివరావు, ప్రభాకర్, బి.సుబ్బయ్య, రంజిత్, సెరస్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిజం విద్యార్థులకు దిశానిర్దేశం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం విద్యార్థులకు వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి దిశానిర్దేశం చేశారు. మంగళవారం తన కార్యాలయంలో విద్యార్థులతో మాట్లాడారు. మీడియా రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకతను పలు ఉదాహరణలతో వివరించారు. జర్నలిజం కోర్సును పూర్తిచేసే సమయానికి జ్ఞానంతో పాటు ప్రత్యక్ష అవగాహన కలిగి ఉండాలన్నారు. జర్నలిజం విభాగం నుంచి నూతన స్టార్టప్ సంస్థలు రావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఏయూ నుంచి ప్రచురితమవుతున్న వార సంచిక ఏయూ లుక్స్ తీర్చిదిద్దడంలో యువత తమ ఆలోచనలు పంచుకోవాలని సూచించారు. విద్యార్థులు నిత్యం కొంత సమయాన్ని కేటాయిస్తూ ఏయూ లుక్స్ విస్తరణలో భాగం కావాలని ఆహ్వానించారు. విదేశీ విద్యార్థుల భాగస్వామ్యం సైతం ఎంతో కీలకమన్నారు. ఏయూ లుక్స్ సంచిక వేలాది మందికి చేరువవుతోందని, రానున్న కాలంలో మరిన్ని మార్పులు తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ వినయ్‌కుమార్, మీడియా రిలేషన్స్ డీన్ ఆచార్య చల్లా రామకృష్ణ పాల్గొన్నారు.

గంబూసియా చేపలతో దోమల నివారణ



బావిలో గంబూసియా చేపలు వదులుతున్న కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలో వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు కోడిగుడ్ల పూర్ణిమ చేతుల మీదుగా మంగళవారం పలు బావుల్లో గంబూసియా చేపలు విడిచిపెట్టారు. డెంగ్యూ దోమల గుడ్లను ఈ చేపలు తినడం వల్ల దోమల వ్యాప్తి తగ్గుతుందని, అందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆమె తెలిపారు. అనంతరం మలేరియా విభాగం అధికారులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి డెంగ్యూపై అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉండే చోట ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, నీళ్ల ట్యాంకులు, చేపల అక్వేరియంలు, మొక్కల మొదళ్లను తేమ లేకుండా పొడిగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో జోన్–5 మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్, సూపర్‌వైజర్ సూర్యకుమారి, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ డీవీఎస్ఎస్ఎన్ ప్రసాద్, అర్జున్, వైభవ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్, వెళంగిణిరావు, రాజాన శ్రీను, శ్యామ్‌సుందర్, తిరుమలరావు, కమల్‌కుమార్, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆహారం, చీరల పంపిణీ



నిరాశ్రయులకు భోజన పొట్లాలు అందిస్తున్న భాస్కరరావు

సింధియా : కాలిఫోర్నియా స్నేహితుల సహకారంతో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన డ్రాయింగ్ టీచర్ చెల్లూరి భాస్కరరావు గాజువాక నుండి సింధియా వరకు ఉన్న నిరాశ్రయులకు భోజన పొట్లాలు, చీరలు పంపిణీ చేశారు. అలాగే జిల్లాలో ఉన్న వివిధ ఆశ్రమాల్లో ఉన్న వృద్ధులకు వారం రోజులుగా చీరలు, ఫలహారాలు, తినుబండాలు అందజేస్తున్నారు. కాలిఫోర్నియాలో ఉంటున్న భాస్కరరావు స్నేహితులు ఎస్సీ ప్రశాంత్, ఏవీఎస్ఎన్ మూర్తి, రాజు, వెంకట, జానకి సహకారంతో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు భాస్కరరావు తెలిపారు. పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న ఔత్సాహిక విద్యార్థులకు ఉచిత డ్రాయింగ్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కాలిఫోర్నియాలో ఉంటున్న దాతల పిల్లలు వెంకటసాయి, శ్రీకాంత్ రాచకొండ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నిరాశ్రయులైన వృద్ధులు, వీధి బాలల పోషణార్థం పోలీసుల తోడ్పాటుతో వివిధ ఆశ్రమాలలో వారిని చేర్పించి, వారి యోగక్షేమాలను నిరంతరం తెలుసుకుంటున్నట్లుగా వివరించారు. నిరాశ్రయులైన వృద్ధులు ఎవరికైనా కనబడితే 9292002185 నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

ఘనంగా ప్రసన్న వినాయక ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న ఏఎస్ఐ తదితరులు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం జాషువానగర్‌లోని ప్రసన్న వినాయక ఆలయ 25వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వరహా గిరిశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. కంచరపాలెం పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ ఆదిరాజు, రాజు సప్లయర్స్ అధినేత కె.ఎస్.ఎన్.రాజు, దళిత నాయకురాలు ఈతలపాక సుజాత పూజల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామి వారి కల్యాణ మహోత్సవం జరిపించా రు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో జాషువా కళాప్రాంగణం గౌరవ అధ్యక్షుడు గొటివాడ నర్సింగరావు, అధ్యక్షుడు అలమండ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గుమ్మిడి ఆదినారాయణమూర్తి, కోశాధికారి గుమ్మిడి అచ్చిబాబు, కమిటీ సభ్యులు పనులు పర్యవేక్షించారు.

పేదలకు రగ్గుల వితరణ



జ్ఞానాపురం రైల్వేస్టేషన్ రహదారిలో రగ్గులు అందిస్తున్న ధర్మాల

కంచరపాలెం: డీఎల్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డీఎల్ రెడ్డి వర్ధంతి సందర్భంగా నిరుపేదలకు మంగళవారం రగ్గులు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు, ధర్మాల ఫౌండేషన్ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ రెడ్డి చేతుల మీదుగా కప్పరాడ, కంచరపాలెం నేతాజీ ఫ్లై ఓవర్, తాటిచెట్లపాలెం, జ్ఞానాపురం రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో పేదలకు దుప్పట్లు, రగ్గులు, అల్పాహారం అందజేశారు. ఆనంద్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ డీఎల్ రెడ్డి కార్మిక నాయకుడిగా కార్మిక రంగంలోనూ, రక్షణ రంగంలో అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు కృష్ణకాంత్‌రెడ్డి, జానకిరామ్, నూకరాజు, కుమార్‌రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.


గద్దర్‌కు కార్మిక సంఘాల నివాళి



స్టీల్‌ప్లాంట్‌లో గద్దర్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

ఉక్కునగరం: ప్రజా గాయకుడు గద్దర్‌కు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు నివాళి అర్పించారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద పోరాట కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో స్టీల్ సీఐటీయూ అధ్యక్షుడు వై.టి. దాస్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఉద్యమంలో గద్దర్ పాత్ర మరువలేనిదన్నారు. పోరాట కమిటీ కన్వీనర్ కె.ఎ స్.ఎన్. రావు మాట్లాడుతూ ఏ ఉద్యమంలోనైనా ప్రజలను మమేకం చేసి తద్వారా పోరాటాలను నిర్వహిస్తే ఆ పోరాటం విజయవంతం అవుతుందని గద్దర్ నిరూపించారన్నారు. జీవిత కాలం ప్రజా చైతన్యం కోసం గద్దర్ కృషి చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, ఓబీసీ సంఘం నాయకులు బి. అప్పారావు మాట్లాడుతూ గద్దర్ తన పాట, ఆటతో ప్రజలను చైతన్యపరిచి, ఉద్యమాలకు ఊపిరి అందించారన్నారు. నాయకులు జి.గణపతిరెడ్డి, సురేష్‌బాబు, కె. పరంధామయ్య, రామకృష్ణ, కామేశ్వరరావు, మహలక్ష్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డీజీఆర్ అధికారి సందర్శన



కమాండర్ యువరాజును సత్కరిస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని డైరెక్టర్ జనరల్ ఆఫ్ రీ సెటిల్‌మెంట్ అధికారి కమాండర్ యువరాజు సందర్శించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌తో వివిధ అంశాలపై చర్చించారు. రక్షణ రంగాల ఉద్యోగులు నూతన ఉపాధి అవకాశాలు పొందేలా ఏయూ అందిస్తున్న సర్టిఫికెట్ కోర్సులు దోహదపడతాయన్నారు. త్వరలో 1000 మందికిపైగా రక్షణ రంగాల సిబ్బంది ఏయూలో శిక్షణకు హాజరవుతారన్నారు. అనంతరం ఏయూలో నిర్వహిస్తున్న పీఆర్‌సీ తరగతులను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏయూ సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏయూ తరపున యువరాజును సత్కరించారు.

ప్రైవేటీకరణతో కార్మికుల జీవితాలు బలి



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్రప్రభుత్వం కుటిల రాజకీయంతో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయాలని చూస్తోందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. దీనివల్ల అమాయకులైన కార్మికుల జీవితాలు బలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 908వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీకి వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవని హెచ్చరించారు. ప్లాంటును పూర్తి స్థాయి ఉత్పత్తి దిశగా నడపాల్సిన యాజమాన్యం కావాలనే నష్టాల వైపు నెట్టే ప్రయత్నాలు చేస్తోందని, వారి ఆటలు సాగవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి



మహాధర్నాలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

పెదగంట్యాడ: విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయవద్దని కోరుతూ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 9న ఉదయం 9 గంటలకు పాత గాజువాక జంక్షన్‌లో నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకుడు వైటీ దాస్, నిర్వాసితుల సంఘం నాయకుడు పులి వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద అఖిలపక్ష యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేశారు. నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో కణితి అప్పలరాజు, బైరెడ్డి గురప్ప, నమ్మి సింహాద్రి, దొమ్మేటి అప్పారావు, నమ్మి రమణ, పాల అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.